తన చేతిలోని మైక్‌ని మఠాధిపతికి ఇచ్చి పక్కకి వెళ్ళిపోయాడు గూఢచారి రామాచారి. మఠాధిపతి చెప్పసాగాడు.

"ప్రేమని, నవ్వులని మనం ఇతరులకి పంచితేనే ఆనందం వెల్లివిరుస్తుంది. అదే ఎవరికైనా పెద్ద పెట్టుబడి. ఆ పెట్టుబడిని మనం వడ్డీతో సహా తప్పక అనుభవిస్తాం అని శాస్త్రం స్పష్టంగా చెప్తోంది. అది ఈ దేహంతో, ఈ లోకంలో ఇక్కడే మనం అనుభవించలేక పోవచ్చు. పై లోకాల్లో మనకి అవసరమయ్యే సంపదని మనం ఇక్కడే, ఈ దేహంతోనే సంపాదించుకుని కేవలం ఇక్కడ నించే తీసుకెళ్ళాలని మీకందరికీ తెలుసు. ఈ దేహం వదిలాక మనం వెళ్ళే లోకంలోకి కోటీశ్వరుడిలా వెళ్ళాలా లేక బిచ్చగాడిలానా అన్నది మీకే వదిలేస్తున్నాను. ఇక మీ ఇష్టం."

## 9. నీడ

ఓ ధనికుడు గొప్ప దాత. 'నేను సంపాదించిన దాన్ని నేను దానం చేస్తున్నాను' అనే భావన లేకుండా, 'అంతా దేవుడి సొమ్ము' అనే నమ్మకంతో దానం చేసేవాడు. అతని ఈ సాత్విక దాన గుణానికి సంతోషించిన దేవుడు ఓ రాత్రి అతనికి కలలో కనపడి చెప్పాడు.

"నీ దాన గుణానికి మెచ్చాను. నీ నీడకి కూడా దానం చేసే గుణాన్ని ప్రసాదిస్తున్నాను."

వెంటనే ఆతను దేవుడి పాదాలకి మొక్కి చెప్పాడు.

"మీ మాటకి అడ్డొస్తున్నాననుకోక పోతే, నా నీడ ముందు కాని, నాకు రెండు పక్కల కాని వున్నప్పుడు కాక, కేవలం నా వెనక వున్నప్పుడే దానం చేసే శక్తిని దానికి ప్రసాదించవలసిందిగా కోరుతున్నాను."

"ఎందుకని?" ప్రశ్నించాడు దేవుడు.

"లేకపోతే నా నీడ కూడా దానం చేస్తోందన్న అహంకారం నాలో కలగచ్చు. నా వెనక అది ఏం చేసినా నాకు తెలీదు కదా. నీడలా వెన్నాడే అహంకారం బారిన నేను పడదలచుకోలేదు." వివరించాడు ఆ ధనవంతుడు.